**శ్రవ్యనాటిక :**

# మీటింగు

### శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

(ఊళ్లో నలుగురు కళాభిమానులు కలసి కళాసేవాసమితి ఏర్పాటు చేద్దామనుకున్నారు సాయంకాలం అయిదున్నరకు బ్రహ్మయ్యగారింట్లో నిజమైన అభిమానులు మాత్రమే సమావేశమై సమితిఆశయాలు, ఆదర్శాలు, ప్రణాళిక మొదలైనవి నిర్ణయించటానికి నిర్ణయమయింది. సరిగా అయిదున్నరకు గడియారం అరగంట కొట్టుతుంది. చీట్లపేకకత్తెర వేసి కలుపుతున్న చప్పుడు)

కామయ్య: ఇదేమిటి, బ్రహ్మయ్యగారూ? చతుర్ముఖపారాయణ పెట్టారేమిటి?

బ్రహ్మయ్య ఏదో మనమిత్రులొస్తేనూ! ...మీరుకూడా కలుస్తారా?

కామ : మంచిమాటే! వాళ్లంతా ఏరీ?

బ్రహ్మ : ఎవళ్లంతా?

కామ : మీటింగనుకున్నాం కాదుటండీ?

బ్రహ్మ : నాకు తెలీదే!

కామ : సరిపోయింది! రంగయ్య చెప్పలా?

బ్రహ్మ : లేదే?

కామ : కొంపతీసి మీటింగు మానుకోలేదు, గద? అవతల అర్జంటు పని మానుకుంటినే నిష్కారణంగా!

బ్రహ్మ : ఇప్పుడు మునిగిపోయిందేమిటీ? చూచొండి, వస్తారేమో. ఎన్నింటికి మీటింగు?

కామ : అయిదున్నరకూ.

బ్రహ్మ : ఇంకేం? ఇప్పుడేగా అయిదున్నరయిందీ? వస్తారు మెల్లిగా. ఈ మీటింగులసంగతి మనకు తెలీంది గనకా!

కామ : నేను మీ ఆట చెడగొట్టటం లేదుగద?

బ్రహ్మ : లేదు, లేదు. ఏమిటిట? ఎందుకీ మీటింగూ?

కామ : కళాసమితి ఒకటి పెట్టాలని. అంతా ఆ సోమేశ్వర్రావు తాపత్రయం. ఎల్లాగైనా ప్రపంచం ఉద్ధరిద్దామంటాడు.

బ్రహ్మ. దానికేం? ఏదో ఒక ఉద్యమం ఉండవలసిందే. నలుగురూ వచ్చిందాకా మీరుకూడా ఒకచెయ్యి వెయ్యకూడదూ?

కామ : అడుగో, రంగయ్య రానే వచ్చాడు.

రంగ : అప్పుడే నలుగురూ చేరారే. భేష్! మరి, సోమేశ్వర్రావింకా రాలా?

కామ: నేను తప్ప ఇంకెవ్వరూ రాలేదు. వీరిద్దరూ బ్రహ్మయ్యగారి స్నేహితులు. మీటింగుసంగతి బ్రహ్మయ్యగారికి చెప్పనే లేదుటగా?

రంగ : (ఆత్రంగా) శర్మను చెప్పమన్నానే? చెప్పలేదుటండీ?

బ్రహ్మ శర్మ నాకు కనిపించనన్నా లేదు. ఊళ్లో ఉన్నాడా?

రంగ : ఉన్నాడని సీతారామయ్య చెప్పాడే!

కామ : ఏంపన్లు, రంగయ్యా? బ్రహ్మయ్యగారితో చెప్పమని శర్మతో చెప్పానంటివి. శర్మ ఊళ్లో ఉన్నాడని సీతారామయ్య చెప్పాడంటివి. ఇదేనా పన్లు చేసే పద్ధతి?

రంగ: నన్ను చావమన్నావా. కామయ్యా! శర్మతో తప్పక చెబుతానన్నాడు సీతారామయ్య. బ్రహ్మయ్యగారితో మీటింగుమాటే చెప్పనా? రఘువయ్యగార్ని అధ్యక్షుడుగా రమ్మనే పిలవనా? వైజ్ఞానికమండలివార్లందర్నీ తప్పక రమ్మనే చెప్పనా? ఒక్కణ్ణీ ఎన్ని చోట్లకు తిరగను చెప్పూ?

కామ : అడుగో, సీతారామయ్య ఏంరా, సీతారాముడూ? నిన్ను నమ్ముకుంటే ఇంతే గద. మీటింగని బ్రహ్మయ్యగారికి చెప్పమని శర్మతో చెబుతానన్నావుటగా?

సీతారామయ్య : (మండిపడుతూ) ఎవడా అన్నగాడిద? నే శర్మతో చెబుతానన్నానూ? ఇటువంటి మాటలంటేనే నాకు మండుకొచ్చేది. మనుషుల్ని చెప్పేట్టు కొట్టబుద్ధయేదీనూ! అసలు నేను శర్మను చూసి ఎన్నాళ్లయిందీ?

కామ : ఎందుకట్లా నోరుపారేసుకుంటావ్? రంగయ్యలో నువేమన్నావ్?

సీతా : ఏమన్నానా? శర్మ కనబడితే అట్లాగే చెబుతా, బాబూ, అన్నా. పరే అయిందేదో అయిపోయింది. రాఘవయ్యగారేరీ? ఏంరా, రంగయ్యా?

రంగ వస్తూంటారు. ఈపాటికి రావలసిందే మరీ

సీతా : నువ్వాళ్ళ చెప్పావుగదా?

రంగ : చెప్పినట్టే అనొచ్చు.

సీతా : అనొచ్చేమిటి, నీ తలకాయా, నా తలకాయానూ? నువెళ్లి చెప్పలేదా?

రంగ : ప్రద్దానికి నేనే యాడవాలంటే ఎట్లా చెప్పరా, సీతారాముడూ? బ్రహ్మయ్యగారితో మీంటింగని చెప్పనా? రాఘవయ్యగారిని అధ్యక్షత కాహ్వానించనా? ఆ వైజ్ఞానికమండలివాళ్ల నాహ్వానించనా? నేనుమాత్రం మనిషిగాదు చెప్పూ! మార్కండేయుల్ని వెళ్లి స్వయంగా పిలుచుకరమ్మన్నా.

కామ : కొంచెం ఆగు. ఇవాళ నువ్వు మార్కండేయుల్ని ఎక్కడ కలుసుకున్నావ్?

రంగ : మార్కండేయుల్ని నే కలుసుకున్నా నేమిటి? రాధాకిష్టుడు కలుసుకున్నాడు.

సీతారామ : కలుసుకున్నాడో లేదో, నీకెట్లా తెలుసూ?

రంగ : ఆఁ అదేమన్న మాటరా? తప్పక కలుసుకునే ఉంటాడు.

కామయ్య : మాపాలిటికి నువ్వెట్లా దొరికావోయ్ రంగయ్యా? ఏంపన్లివీ?

రంగ : ఎవరు లోకువంటే సంబిరామయ్య లోకువ, అనండి. అన్నింటికీ నన్నే అనండి. అడుగో రాధాకిష్టుడు, కావలిస్తే వాణ్ణి అడగండి ఏంరా. నువ్వు మార్కండేయుల్ని రాఘవయ్యగారికోసం పంపలా?

రాధా : పంపానే? ఏం?

రంగ : అందరూ నన్ను దుయ్యబట్టుతున్నారు చూడు

రాధాకృష్ణ : ఈపాటికి మీటింగు ప్రారంభమై ఉంటుందనుకున్నానే? మిగిలినవాళ్లంతా ఏరీ? సోమేశ్వర్రావుగారెక్కడ?

రంగ : వాళ్లు పెద్దవాళ్లూ! వారికోసం మనం కనిపెట్టుకుండాలిగాని వాళ్లు మనకోసం కనిపెట్టుకుండరూ.

రాధాకృష్ణ : వైజ్ఞానికమండలి నుంచి ఒక్క పురుగు రాలేదు మావాడా? అన్నట్టు వాళ్లను, పిలిచావా? సోమేశ్వర్రావుగారు వాళ్లను మరవవద్దని మరీ మరీ చెప్పారు.

రంగ : వాళ్లకి పిలుపు వెళ్లింది. రాకపోతే వాళ్లదే తప్పు.

రాధాకృష్ణ : కొంపతీసి నువ్వాళ్లతోదా ఏం?

రంగ : నే నెన్నింటికని చావను, రాధా? మీటింగని బ్రహ్మయ్యగారికే చెప్పనా? అధ్యక్షుడుగా రమ్మని రాఘవయ్యగార్ని పిలవనా? వైజ్ఞానికమండలివాళ్ళనే ఆహ్వానించనా?

కామ (నిర్ఘాంతపోయి) ఓరి నీతస్సాదియ్యా! నువ్వు ఒక్క పనీ చెయ్యకుండా నే ఎన్నిటికని చావను, ఎన్నిటికని చావనంటావేమిటి? బ్రహ్మయ్యగారికో ఇక్కడ మీటింగని చెప్పకపోతివి రాఘవయ్యగారినా నువ్వు పిలవపోకతివి ఆ వైజ్ఞానిక మండలివాళ్లనూ పిలవకపోతివి ఇంకేమిటి నువ్వు చేసిందీ?

రంగ : కామయ్యా, అందరూ కలిసి నన్ను ఒంటరిగాణ్ణి చేసి ఇట్లా వేధించటం భావ్యంకాదు నావల్ల ఒక్క చిన్న పొరపాటు జరిగినమాట నిజమేకాని అది ఎట్లా జరిగిందీ, ఎందుకు జరిగిందీ నాకు తెలీటం లేదు

కామ ఏమిటా పొరపాటు?

రంగ ఇవాళపొద్దున ఆఫీసుకు బయల్దేరేటప్పుడుకూడా నేను చెయ్యాలిసిన పనులకు బోలెంత వ్యవధి ఉన్నట్టు కనబడింది. తీరా చూస్తే వ్యవధి కాదుగదా, ఊపిరి పీల్చే అవకాశంకూడా కనిపించలేదు ఆ తొందరలో వాళ్ల కాళ్లూ, వీళ్ల కాళ్లూ పట్టుకో వలిసివచ్చింది ఒక్కొక్కరినీ టెలిఫోను మీద అందుకోవటానికి అరగంట పట్టిందంటే నమ్మండి

బ్రహ్మ అయిందేదో అయింది ఇంత మందిమి చేరనేచేరాం. ఆ రాఘవయ్యగారూ, సోమేశ్వరావుగారూ వస్తే మీటింగు ఆరంభించేస్తాంగా? (టెలిఫోన్ మోగుతుంది) ఒక్కక్షణం.. హల్లో! బ్రహ్మయ్యను మాట్లాడుతున్నాను నేనే! అయ్యా? ఆహా, తెలిసింది తెలియటంకాదు. ఇక్కడ అందరూ చేరారుకూడానూ! .. ఎవిడీ? , అవును, మీకోసమే ఎదురుచూస్తూన్నాం. మీకో సమూ. రాఘవయ్యగారికోసమూనూ . అయ్యా? రాఘవయ్యగారు వస్తానన్నారు గదా! ఇంకేం? మీరు వెగిరం వచ్చెయ్యండి, ఆరుకూడా కావస్తోంది రేపా? రేపింకో మీటింగున్నదా ఏమిటి? . . అసలు మీటింగే రేపా? ఇవాళ కాదూ? అదేమిటండీ? రంగయ్యగారూ. చూడండి, రంగయ్యగారూ, మీటింగు రేపటగా?

రంగయ్య. చచ్చాను! ఎందుకురా చేతులూ, కాళ్లూ ఆడకేడూ అనుకున్నాను. రేపా మీటింగూ?

కామ : చూడవోయ్, నీకంగారువల్ల ఎంతమందికాలం వ్యర్థమయిందో.

రంగ నువ్వు నన్నేమీ అనకోయ్. ఇంతమందుండే నువ్వు నావల్ల కించిత్తునిప కాలేదన్నావు చూడు ఎంతమందిని సమావేశపరిచానో! ఇంకొస్తుంటే సోమేశ్వరావుగార్ని, ఆ రాఘవయ్యగార్ని కూడా సమావేశపరిచేద్దును.

బ్రహ్మ : మీటింగు లేకపోతే పోయింది నలుగురూ తటస్థపడ్డారు కూచునే వాళ్లు కూచోండి రెండు పేకలు కలిపి రమ్మీ వేద్దాం

అందరూ : పట్టండి పట్టండి.

(పేక కత్తిరించి కలిపిన చప్పుడు)

